## సూత్రధారి

జీవితంలో మనకు ఎన్నో సమస్యలు వస్తూనే ఉంటాయి. పూజలు చేసినా, ధ్యానం చేసినా, లేదా ఏ ఇతర సాధనలు చేసినా సమస్యలు వస్తూనే ఉంటాయి. కనుక ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సినది ఏమిటంటే, కష్టాలు అందరికీ ఉంటాయని. కానీ తేడా ఏమిటంటే, ఎవరి స్థితిని బట్టి వారికి కష్ట-సుఖాలు వస్తూ ఉంటాయి. మన సమస్యలకు పరిష్కారం బాహ్యంగా వెతికితే జీవితం దుఃఖమయం అవుతుంది. అదే అంతర్ముఖంలో పరిష్కారం వెతికితే జీవితం అద్భుతంగా ఉంటుంది. బహిర్ముఖ ప్రయత్నాన్ని అధిగమించి, అంతర్ముఖ ప్రయత్నం చేస్తే సమస్యలకు సులభమైన పరిష్కారాలు లభిస్తాయి.

మనం పుట్టినప్పుడే పరమాత్మ మన తలరాత రాసేసాడు. అదేమిటంటే నా పిల్లలు నా అంతటి వాళ్ళు కావాలని. అంటే అహం బ్రహ్మాస్మి అని, నేనే దేవుడినని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. అంటే తమో గుణం, రజో గుణం, సత్వ గుణం, శుద్ధసాత్వికం మరియు నిర్గుణమనే అయిదు క్లాసులు తప్పక అందరు చదవాలని, వీటికి సంబంధించిన కష్ట-సుఖాలు మన జీవితంలోకి తప్పక వస్తాయని

గ్రహించండి. పరమాత్మ అంటే ఎవరు? మన అందరిని పుట్టించిన వాడు, మన నిజమైన తండ్రి. మొదట్లో గుడికి వెళ్ళితే ఫలితాలు లభించాయి. ఎందుకంటే మనం అప్పుడు చిన్న పిల్లలం కనుక. కానీ ఇప్పుడు రావడం లేదు, ఎందుకంటే మనం ఎదిగాం కనుక. ఇప్పుడు మనంతట మనమే మనలోని దైవం సహాయంతో ప్రతీ దానిని సాధించగలిగే స్థితికి చేరాం కనుక.

దీనిని ఉదాహరణ ద్వారా వివరిస్తాను. నాకు ఒక వెబ్‌సైట్ ఉంది, దానికి రూ.10,000/- కట్టాను. అంతకు ముందు ఐదేళ్ళకు అయిదు వేలు కట్టాను. సర్వీస్ బాగుంది కదా అని, ఇప్పుడు పదేళ్ళకు పది వేలు కట్టాను. పదేళ్ళు సర్వీస్ ఇస్తానని చెప్పి రెండేళ్ళు బాగానే ఇచ్చాడు, కానీ ఈమధ్య కంపెనీ ఎత్తేశాడు, ఫోన్ చేసినా లిఫ్ట్ చెయ్యడం లేదు. నాకు పదివేలు లాస్, నేను ఇప్పుడు ఏమి చెయ్యాలి?

నాకు కోపము వచ్చింది. ఎందుకంటే నేను ఫిక్స్ అయ్యాను. అంటే 10 ఏళ్ళు నా సొంతం అనుకున్నాను. ఎప్పుడైతే మనం ఫిక్స్ అవుతామో, అప్పుడు అది జరగకపోతే మనకు బాధ తప్పక వస్తుంది. అప్పుడు నేను లోపల తిట్టుకుంటూ మార్గదర్శకుడు టాపిక్‌లో చెప్పినట్టు సాధన చేసాను.

అప్పుడు దైవాన్ని అడిగాను, పది వేలు ఎందుకు నేను లాస్ అయ్యాను, నువ్వు చెప్తేనే కదా కొన్నాను, మరి ఎందుకు లాస్ అయ్యాను, దీనికి పరిష్కారం ఏమిటని అడిగాను – “ఇప్పుడు వాడి దగ్గర నుండి నీకు ఇప్పించడము సాధ్యమే. వాడికి ఆలోచన పంపించి ఎనర్జీ ఇచ్చి, వాడి చేత పది వేలు ఇప్పించవచ్చు. కాని వాడు కోట్లు నష్టపోయాడు, వాడు దాని నుండి రికవర్ అవ్వడం కష్టం, అందుకని వాడిని క్షమించి వాడి స్థితిని అంగీకరించు. ముందు నువ్వు ప్రశాంత స్థితికి రా, నీవు నష్టపోయిన పది వేలు నేను ఇతర మార్గాల ద్వారా సమకూరుస్తానని చెప్పాడు.” ఆ తర్వాత ఊహించని విధంగా ఒకావిడ నా వద్దకు వచ్చి కౌన్సిలింగ్ తీసుకుని సరిగ్గా పది వేలు ఇచ్చింది.

అలాగే మా శిష్యుడు నేను యాప్ తయారు చేసి ఇస్తానని చెప్పి, ఫ్రీగా ధర్మం అనే యాప్ తయారు చేసి ఇచ్చాడు. అంటే వెబ్ సైట్ అవసరము లేకుండా యాప్ వచ్చింది. అలాగే ఆ తర్వాత darmam.com అనే website ని కూడా తయారు చేసాడు.

అలాగే డబ్బుల కోసం మోసం చేసే వాళ్ళను లోపల అంగీకరించాను. విచిత్రముగా నేను 15 లక్షలతో డబుల్

బెడ్ రూమ్ ఫ్లాట్ కొన్నాను. నా వద్ద డబ్బులు కేవలం 2 లక్షలే ఉన్నప్పటికీ, మా శిష్యుల సాయంతో ఫ్లాట్ తీసుకున్నాను. కేవలం రెండు రోజులలోనే మిగత డబ్బు సమకూరింది. ఇదంతా ఎలా జరిగింది, లోపల నా దైవము చెప్పినట్టు చేయడం వలన. అలాగే నా సంకల్పం నెరవేరడంలో నేను 33.33% మాత్రమే ఉంటూ, 33.33% ఆత్మకు, మిగతా 33.33% పరమాత్మకు స్థానం ఇవ్వడం వలన. కనుక జీవాత్మ-ఆత్మ-పరమాత్మలు కలిస్తే ఏదైనా సాధ్యమే.

తాను ఒకటి తలిస్తే దైవము మరొకటి తలుస్తాడు అంటారు, నేను వెబ్‌సైట్ పదేళ్ళు ఉంటుంది అని అనుకున్నాను. కానీ దైవం 2 ఏళ్ళలలోనే కట్ చేశాడు. అది ఆయన సంకల్పం. ఫస్ట్ కోపం వచ్చి తిట్టుకున్నాను, తరువాత ఆ దైవం నాకు వ్యతిరేకముగా ఎందుకు తలిచాడు, దానికి ఏదో కారణం ఉంటుందని అనుకున్నాను. దైవం నాకు కష్టాన్ని ఇచ్చాడంటే దానిలో నేను గుర్తించవలసిన మర్మం ఏదో ఉంటుందని అనుకుని, దైవం నీ సంకల్పం ప్రకారమే జరగని, నష్టం వల్ల ఏదైతే బాధ ఏర్పడిందో దానిని దివ్యంగా దైవ ప్రసాదంగా అనుభవిస్తానని అనుకుని,

ఆ బాధను ఇష్టంగా ప్రేమతో అనుభవించి లోపల ధర్మస్థాపన చేసాను. అంటే మోసం చేసే వాళ్ళు 33.33% ఉండాలని అనుకున్నాను. (ధర్మం గురించి మరింత సమాచారం కోసం ధర్మం అనే టాపిక్‌ని చదవండి.)

సమస్యను దివ్యంగా మీరు ఎప్పుడైతే అనుభవించి ధర్మస్థాపన చేస్తారో, అప్పుడు దైవం మీకు బాహ్యంగా ఏది అవసరమో వాటిని మీకందిస్తాడు. దైవం నా అర్హతను బట్టి 15 లక్షల ప్లాట్ ఇచ్చాడు. నేను కోట్లు అడగవచ్చు, కాని దైవానికి తెలుసు నాకు ఎంత ఇవ్వాలో. ఎక్కువ ఇస్తే మనం మాయలో పడే అవకాశం ఉందని దైవానికి తెలుసు. మన దైవంతో మనం కలిసికట్టుగా పనిచేస్తే, ఆయన సంకల్పాన్ని మనం నెరవేరిస్తే అంటే జీవితంలో వస్తున్న కష్ట-సుఖాలను దివ్యంగా అనుభవిస్తూ ధర్మస్థాపన చేస్తే, దైవీక గుణాలను పెంచుకుని ఆయనకు శృతి అయితే, ఆయన తప్పకుండా మనకు కావలసినవి సమకూరుస్తాడు.

## పాత్రధారి నుండి సూత్రధారిగా పరివర్తన చెందడం ఎలా?

దైవానికి తగ్గటుగా మనము శృతి కావాలి, అప్పుడే ఆయనతో

మనకు కనెక్షన్ ఏర్పడుతుంది. కనుక మీరు ప్రతి పరిస్థితిలో ఆయనతో శృతి అవ్వడమే మీ ముందు ఉన్న అసలైన సవాల్. కనుక మీరు ఆయనకు తగ్గటుగా ఎలా మారాలి? ఆయన దగ్గరకు ఎలా వెళ్ళాలి? అసలు ఆయన చిరునామా ఏమిటి? ఆయన గుణ-గణాలేమిటి?.. అనే వాటి గురించి మీరు తెలుసుకోవాలి.

ఆయన పాత్రధారా, సూత్రధారా? నటించేవాడా, నడిపించేవాడా? ఆయన నడిపించేవాడు, మీరు నటించేవారు. కనుక మీరు నడిపించే వాడికి, నటించేవాడికి మధ్య తేడాను బాగా అర్ధము చేసుకోవాలి. మీకు సులువుగా అర్ధమయ్యేలా చెప్పాలంటే, నడిపించేవాడు అంటే డైరెక్టర్, పాత్రధారి అంటే నటించేవాడు. అంతర్ముఖంగా చెప్పాలంటే, ఆత్మ నడిపించేవాడు, జీవాత్మ అంటే మీరు నటించేవారు. మీరు నటులుగా మాత్రమే ఉంటున్నారు, మీరు నడిపించేవారిగా తయారు కావాలి అంటే ప్రతి పరిస్థితిలో మీరు పాత్రధారి నుండి సూత్రధారిగా పరివర్తన చెందడం అలవాటు చేసుకోవాలి.

కనుక డైరెక్టర్ - యాక్టర్‌కి మధ్య తేడా మీరు తెలుసుకోవాలి, ఎందుకంటే మీరే డైరెక్టర్ కావాలి కనుక.

మీరు డైరెక్టర్ అయితే తప్ప మీరు ఒరిజినల్ డైరెక్టర్ దగ్గరకు చేరలేరు. కనుక ముందు మీరు అసిస్టెంట్ డైరెక్టర్ అవ్వాలి.  మీ ఒరిజినల్ డైరెక్టర్ మీ ఆత్మ.

మీరు సినిమాలు చూస్తారుగా! సినిమాలో ఎవరిని చూస్తారు: హీరో, హీరోయిన్, విలన్, జోకర్ మొదలైనవారు, అంటే అందులో త్రిగుణాలైన మంచి-చెడు-తటస్థ పాత్రలు తప్పక ఉంటాయి. సినిమాలో హీరో మాట హీరోయిన్ వింటుందా, లేక హీరోయిన్ మాట హీరో వింటాడా? డైరెక్టర్ మాటే ఇద్దరు వింటారు గానీ, పాత్రధారులు ఒకరి మాట ఇంకొకరు వినరు. కనుక మీరు అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే హీరో కూడా తాను అనుకున్నవి సాధించలేడని, అతను కూడా డైరెక్టర్ చేతిలో కీలుబొమ్మ అని. కనుక మీరు డైరెక్టర్ అయితే తప్ప మీ జీవితం మీ చేతుల్లోకి రాదు.

బయటకు డైరెక్టర్ ఎంత మంచిగా కనబడుతున్నా, ప్రతీ గుణము యొక్క అనుభూతి అతనిలో కొద్దిగా అయినా ఉంటుంది, లేకపోతే అతను ఆ పాత్రను సృష్టించలేడు. సినిమా తీసేప్పుడు డైరెక్టర్ ఎవరి పట్ల పక్షపాతం చూపించడు, సమదృష్టితో ఉంటాడు.

ఆయన సృష్టి చేసిన వ్యతిరేకమైన పాత్రలకు సమానమైన శక్తిని మరియు విలువను ఇస్తూ, వాటిని డైరెక్ట్ చేస్తూ సినిమా తీస్తాడు. ఇప్పటి వరకూ ఏ డైరెక్టర్ కూడా కేవలం మంచి పాత్రలతో సినిమా తీయలేదు, భవిష్యత్తులో తీయలేరు కూడా. ఎందుకంటే అది అసాధ్యం కాబట్టి. మంచి యొక్క గొప్పతనం చూపించాలంటే, చెడు యొక్క అవసరం తప్పక ఉంటుంది. అలాగే చెడు యొక్క కఠినత్వం చూపించాలంటే మంచి అంటే సున్నితమైన పాత్రను తప్పక సృష్టించాలి.

అలాగే భగవంతుడి దృష్టిలో ఇదంతా జగన్నాటకం. కనుక ఆయన సాక్షిగా ఉంటూ అందరికీ గాలి, వెలుతురు, నీరు మొదలైనవి సమానంగా అందిస్తాడు. అలాగే తుఫానులు వచ్చినప్పుడు, ప్రకృతి - దారిలో ఉన్న అన్నింటినీ తీసుకెళ్తుంది. మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళు ఇద్దరూ చనిపోతారు. దారిలో ఉన్న గుళ్ళు, మసీదులు, చర్చ్‌లు అన్నీ కొట్టుకుపోతాయి. అంటే ఇక్కడ ప్రకృతి, ఎవరి పట్ల వ్యత్యాసం చూపించడం లేదు. అనగా సృష్టి కొనసాగడానికి మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు ఇద్దరి యొక్క అవసరం ఉంది. అందుకే ఇదంతా

పరమాత్మ ఆడిస్తున్న జగన్నాటకం అని అంటారు.

కానీ అజ్ఞానంలో మాయలో ఇరుక్కున్న పాత్రధారిగా ఉన్న మీరు నచ్చిన వాళ్ళే ఉండాలి, నచ్చని వారు ఉండకూడదని అనుకుంటున్నారు. మంచి వాళ్ళు చెడ్డవాళ్ళు ఉండకూడదని, చెడ్డవాళ్ళు మంచి వాళ్ళు ఉండకూడదని అనుకుంటారు. ఇలా అనుకుంటే మీరు అధర్మం చేస్తున్నట్టు. ఎందుకంటే ఏదో ఒకవైపు ఉంటూ, వ్యతిరేకమైన వాటిని తిరస్కరించడం అంటే నేరుగా దైవాన్నే దూషించినట్టు అవుతుంది, ఎందుకంటే ఆయనే వాటిని సృష్టించాడు కనుక.

అలా కాకుండా జ్ఞాన-దృష్టితో ఆలోచిస్తే, ఈ సృష్టి కొనసాగాలంటే మూడు వ్యతిరేకమైన పాత్రలు వేసే మనుష్యులు తప్పక అవసరమౌతారు. ఎందుకంటే దైవంలో మూడు గుణాలు సమపాళ్ళలో ఉండి కలిసి ఏకమై ఉన్నాయి కనుక. అనగా సృష్టి నడవాలంటే వెలుగు-చీకటి-సంధ్య అంటే మంచి-చెడు-తటస్థం అనేవి తప్పక అవసరమౌతాయి. లేకుంటే సమతుల్యత లోపించి ప్రళయం సంభవించవచ్చు. కనుక కేవలం మంచిగా ఉండే ప్రపంచం అసాధ్యం. అయితే త్రిగుణాలతో విడిగా ఉన్న

ప్రస్తుత ప్రపంచం కొనసాగుతుంది లేదా త్రిగుణాలు కలిసి ఏకమై ఉన్న స్వచ్ఛమైన ప్రపంచం ఏర్పడుతుంది. (సమతుల్యత గురించి మరింత సమాచారం కోసం సమతుల్యతం అనే టాపిక్‌ని చదవండి.)

అటమ్స్ నుండి ఎలక్ట్రాన్స్‌ని తీసివేయగలమా? తిసివేయలేం. సృష్టి ఒక్క మగవాళ్ళతో నడుస్తుందా? ఒక్కఆడవాళ్ళతో నడుస్తుందా? నడవదు, మీరే ఆలోచించండి. కనుక ప్రతీ దానిలో కూడా వ్యతిరేకాలు ఉండవల్సినదే.

మహాభారతములో చివరికి పాండవులు గెలిచారు. కౌరవులు అందరూ చనిపోయారు. కాని చెడును నాశనం చేయడంలో భాగంగా పాండవుల కొడుకులందరూ చనిపోయారు. కనుక చాలా మంది అనుకున్నట్టు ఇక్కడ చెడుపై మంచి గెలవలేదు, అధర్మం నశించి ధర్మస్థాపన జరిగింది, సృష్టి సమతుల్యతకు చేరుకుంది.

అలాగే మనం చూసే దాదాపు అన్ని సినిమాలలోకూడా హీరో గెలిచాడని చూపిస్తారు. కానీ హీరోయిన్‌కి ఏదో అవుతుంది, హీరోకి సంబంధించిన వారు ఇబ్బందుల పాలౌతారు, విలన్ మంచి వారిని చంపేస్తాడు. అంటే ఇక్కడ

మంచి 100 శాతం గెలుస్తోందా! ఆఖరికి మంచి గెలిచిందని శుభం కార్డు వేసి చూపిస్తారు డైరెక్టర్లు.

అలాగే అందరి జీవితాలను ఒకసారి గమనించండి, మంచివాళ్ళ జీవితమైనా, చెడ్డవాళ్ళ జీవితమైనా ఆఖరికి దరిద్రంగానే ముగుస్తోంది గానీ ఆనందంగా ముగియటం లేదు. సమస్యలతో సతమతమౌతూ ఎందుకురా ఈ జీవితం అనే భావనతో జీవించి, చివరికి దుఃఖంతోనే చనిపోతున్నారు. దీనికి కారణం వారిలో ధర్మం కొలువై ఉండకపోవడమే. సూత్రధారులుగా వారి జీవితాన్ని గడపక పోవడమే. కాబట్టి ఎందుకు మీ జీవితం దుఃఖంతో ముగుస్తోంది, జీవితాన్ని ఎందుకు హాయిగా, సంతోషంగా, సరదాగా కొనసాగించ లేకపోతున్నారు అనే దాని గురించి మీరు తప్పక ఆలోచించాలి.

డైరెక్టర్ - అన్ని పాత్రలను సమాన దృష్టితో చూస్తూ, అందరినీ నటనలో జీవింపజేస్తూ, అన్ని పాత్రలతో సరదాగా ఉంటాడు. అలాగే పరమాత్మకి తెలుసు, జీవాత్మకి ఆత్మకి చావు లేదని, శరీరాలకు మాత్రమే చావు-పుట్టుక ఉన్నదని. శరీరం నశించినా ఆత్మ తన ముందే సజీవంగా ఉంటుంది. కనుక దైవం దృష్టిలో ఇదంతా సరదా

గిల్లికజ్జాల నాటకమే. అందుకే ఆయన దేనికి బాధపడడు. అన్నింటిలో నిశ్చలముగా ఉంటాడు.

అలాగే దైవం భగవద్గీతలో చెప్పినట్టు, మనం మంచి-చెడులను సమానంగా స్వీకరించే స్థితికి, స్థిత-ప్రజ్ఞ స్థితికి చేరాలి. కానీ మనం ఇది చేయడం లేదు. ఆయన ఒకటి చెబితే మనం వేరొకటి చేస్తున్నాం. ఆయన చెప్పింది చేయడం లేదు కనుకే ఆయన మన కోరికలు తీర్చటం లేదు. అందువలన ఆయన చెప్పింది ప్రాక్టీకల్‌గా చేసి చూడండి. అప్పుడే మీకు తెలుస్తుంది ఆయన ఎంత అద్భుతమైన సృష్టి చేసాడో.

## సాధన

ఉదాహరణకు మీకంటే బలవంతులు మిమ్మల్ని మోసం చేసారనుకోండి, మీరు వాళ్ళని బయట సార్ సార్ అని అంటారు, కాని లోపల బండ బూతులు తిట్టుకుంటారు. అంటే మనసా-వాచా-కర్మణా ఒకటే చేయటం లేదు. అంటే మీరు ఒకటిగా కాకుండా విభజింపబడి ఉన్నారు. అప్పుడు అంతరంలో ఉన్న మోసం ఎనర్జీకి కోపము వచ్చి మిమ్మల్ని మళ్ళీ వాళ్ళు మోసం చేసేలా చేస్తుంది. అందుకే మీరు వాళ్ళ చేతులలో మోసపోతూనే ఉంటారు. కనుక మీరు చేయవలసిన

సాధన ఏమిటంటే, నేను ఆడదాన్ని కాదు మగవాడిని కాదు, నేను జీవాత్మను, ప్రతీ సమస్యను నేనే సృష్టించుకున్నాను, ప్రతీ సమస్యకు నా లోపలే పరిష్కారం ఉంది, దాని కోసం దైవం వైపు అడుగులు వేస్తానని అనుకోవాలి.

అలాగే మీ అంతరంలో రెండు పాత్రల మధ్య ఘర్షణ జరుగుతున్నప్పుడు మీరు గుర్తించ వలసినది ఏమిటంటే, మీరు మోస పోయిన పాత్రతో మిమ్మల్ని మీరు గుర్తించుకొని మోసం చేసిన వాడిని తిడుతున్నారని. అంటే మీరు నటుడిగానే ఉంటున్నారని. అప్పుడు నేను నటుడి నుంచి డైరెక్టర్ కావాలని సంకల్పించి, మీ పాత్ర నుంచి మీరే వేరు పడి, మోసపోయిన పాత్రతో ఇలా మాట్లాడాలి – ఏంటిరా, నేను మంచి వాడిని, నేను ఎవరినీ మోసం చేయను, నేను గొప్పవాడిని అని భావించి, ఎల్లప్పుడు మోసం చేసే వాళ్ళను ద్వేషిస్తున్నావు. ఇలా నువ్వు ద్వేషిస్తున్నావు కాబట్టే నువ్వు వాళ్ళ చేతుల్లో ఒడిపోతున్నావు.

కాని నాకు ఇద్దరు సమానమే. నేను అందరికీ సహకరిస్తాను. నేనే అతనికి శక్తిని ఇచ్చి నిన్ను మోసం చేసేలా ప్రేరేపించాను. అలాగే నువ్వు

మోసపోయేందుకు అతని పై నీకు నమ్మకాన్ని కలిగించాను. ఎందుకంటే అన్ని రకాల పాత్రలను దివ్యంగా చూడగలిగే స్థితికి చేర్చి, నిన్ను సూత్రధారుడిగా చేయడం నా కర్తవ్యం. కనుక ఇక్కడ ఎవరిదీ తప్పు లేదు. కాబట్టి నువ్వు వ్యతిరేక గుణాలను కూడా గౌరవించు. నీలో మంచి అతిగా ఉంది, దానిని 33.33 శాతానికే పరిమితం చెయ్యి. అలాగే నేను డైరెక్టర్‌ననే భావనతో ఉంటూ మూడు గుణాలు 33.33 శాతం ఉండవలసిందేనని ఖచ్చితంగా ఆ పాత్రకు మీరు చెప్పండి.

అలాగే మోసం చేసే గుణంతో ఇదే విధంగా మాట్లాడి దానికి కూడా అర్ధమయ్యేలా చెప్పండి. నేనే మీకు ఈ పాత్రలు చేయమని చెప్పానని, నేనే మీకు శక్తినిస్తున్నానని, కాని నేను మీ పక్కనే ఉన్నానని మరచి మీరిద్దరూ ఒకరిమీద ఒకరు ఆధిపత్యాన్ని సాధించాలని చూస్తున్నారు. సినిమాలో పాత్రధారులు ఒకరినొకరు గాయపరుచుకుంటున్నట్టు నటిస్తారు కాని నిజంగా కొట్టుకోరు. కాని మీరు నిజంగానే గాయపరుచుకుంటూ చంపేయాలని చూస్తున్నారు. కాని ఎల్లప్పుడూ ఒక్కరే గెలవడం అసాధ్యమని, అలాగే కేవలం ఒక్కరే

మిగిలి ఉండడం కూడా అసాధ్యమని, ఇద్దరూ లేకుండా ఏ ఒక్క సంఘటన జరగదని, కనుక దీనికి పరిష్కారం రెండు పాత్రలు ఒకరినొకరు గౌరవించుకుని, సఖ్యతతో కలిసికట్టుగా నటించాలని, సన్నివేశం అయిపోయిన తర్వాత ఇద్దరూ కలిసి ఒకటై పోవాలని ఖచ్చితంగా చెప్పండి.

ఆ తర్వాత మోసపోవడం వలన ఏర్పడిన బాధను దైవ ప్రసాదంగా భావించి అనుభవించండి. దానిని ఏమి చేయాలని చూడకుండా అదే మిమ్మల్ని మార్చడానికి అనుమతినివ్వండి. ఆ బాధకు ఈ విధంగా చెప్పండి - బాధ ఇన్ని రోజులు నిన్ను నేను మార్చాలని చూసాను లేదా నీ నుండి పారిపోవాలని చూసాను లేదా నిన్ను చంపాలని చూసాను. కాని ఇప్పుడు నిన్ను దైవం యొక్క ప్రతినిధిగా చూస్తున్నాను. నేను సూత్రధారి అవ్వడానికి నాకు సహకరించు, నేను గతంలో చేసిన కర్మలన్నింటిని దగ్ధం చేసి నన్ను స్వచ్ఛంగా చెయ్యి అని చెప్పి ఆ బాధకు అంకితమవ్వండి. తర్వాత మీరు ఏమి చేయకుండా బాధ మధ్యలోకి వెళ్ళి కూర్చోండి. ఎలాగైతే అగ్నిలో ముడి బంగారాన్ని వేసి కాలిస్తే, అప్పుడు ఆ అగ్ని మలినాన్ని తొలగించి మీకు స్వచ్ఛమైన బంగారాన్ని అందిస్తుందో,

అదే విధంగా బాధ అనే అగ్ని, మీలో ఉన్న మాలిన్యాలన్నింటిని తొలగించి మిమ్మల్ని స్వచ్ఛమైన వారిగా తయారు చేస్తుంది. ఆ తర్వాత మీ స్వచ్ఛమైన స్థితిని చూసి, బాధ దానంతటి అదే కరిగిపోతుంది.

ఎలాగైతే డైరెక్టర్ తను ఇచ్చిన పాత్రను, పాత్రధారుడు సరిగ్గా చేసేంత వరకు అదే సీన్‌ని కొనసాగిస్తాడో, అదే విధంగా మోసపోయిన పాత్రను మీరు దివ్యంగా అనుభవించేంత వరకూ మీ ఆత్మ అదే సమస్యను కొనసాగిస్తుంది. దివ్యంగా అనుభవించిన తక్షణమే మీకు ఇచ్చిన పాత్రకు సంబంధించిన మేకప్‌ని తొలగించి మీకు కొత్త పాత్రను సృష్టించి ఇస్తుంది. ఇలా ఆత్మ ఎందుకు చేస్తుందంటే మీరు భూమి మీదకు వచ్చిన లక్ష్యం - త్రిగుణాలకు సంబంధించి అన్ని పాత్రలు ఎత్తి, వాటి గురించి అనుభవపూర్వకంగా తెలుసుకుని, చివరికి నేనే డైరెక్టర్‌నని నేనే ఆత్మనని నేనే దైవాన్నని అనుభవపూర్వకంగా తెలుసుకోవడం కనుక.

ఆత్మ అంటేనే సమపాళ్ళలో ఉన్న తమో-రజో-సత్వ గుణాలు. ఆత్మ మూడింటితో సరదాగా నాటకాన్ని సృష్టించి వాటికి శక్తినిస్తుంది. మీరు కూడా మూడు గుణాలను

ఉపయోగించండి. లోపల ఇలా చేసి బయట ఏమి జరుగుతుందో చూడండి. ఆనందమే మీరై పోతారు. బాహ్యంగా కూడా అద్భుతమైన ఫలితాలను సాధిస్తారు. కనుక అన్ని సమస్యలకు పరిష్కారం, పాత్రధారి నుండి సూత్రధారిగా పరివర్తన చెందడం. ఆ తర్వాత ఒకేసారి సూత్రధారిగా ఉంటూనే పాత్రలను వేయడం. అంటే దివ్యమానవుడిగా పరివర్తన చెందడం అన్న మాట.

ఏ సమస్యకైనా మీరు ఈవిధంగా సాధన చేస్తే అన్నింటికీ పరిష్కారాన్ని కనుగొంటారు. నేను 2004 నుండి ఈ సాధనే చేస్తూ నా లైఫ్‌ని నేను ఎంజాయ్ చేస్తున్నాను. నేనే కాదు చాలా మంది ఈ సాధన చేస్తూ వాళ్ళ సమస్యలను వాళ్ళంతట వాళ్ళే పరిష్కరించుకుంటూ వారి లైఫ్‌ని వాళ్ళు ఎంజాయ్ చేస్తూన్నారు.

కనుక దయచేసి పాత్రధారి నుండి సూత్రధారిగా పరివర్తన చెంది, మీ లైఫ్‌ని ఎంజాయ్ చేసి ఇదే ఆఖరి జన్మ చేసుకోండి. అది కేవలం మీరు సూత్రధారి అయ్యినప్పుడే సాధ్యమవుతుంది. పాత్రధారిగా ఉన్నంత సేపు మంచి-చెడు-తటస్థం పాత్రలు వేస్తూనే ఉంటారు, కాని మీరు ఎన్నటికీ

మూడు గుణాలకు అధిపతి కాలేరు. నిర్గుణ స్థితికి, గుణాతీత స్థితికి చేరలేరు.

** ఈ లింక్‌ని క్లిక్ చేసి ఆడియోలు వరుసగా వింటే మరియు టాపిక్స్ చదివితే, మీకు న్యూఎనర్జీ-అద్వైతం కాన్సెప్ట్ స్పష్టంగా అర్థమవుతుంది.

[http://darmam.com/important-topics.html](http://darmam.com/important-topics.html)